

గొప్ప భాషాశాస్త్రవేత్తల్లో
భారతదేశానికి చెందిన ఇద్దరిలో ఒకరు;
గిడుగు రామ్మూర్తి పంతులు ప్రవేశపెట్టిన
వ్యవహార భాషోద్యమ స్రవంతి ఆగిపోకుండా,
ముందుకు నడిపించే బాధ్యతను తన భుజాలకెత్తుకొన్నవారు.
భాషా క్షేత్రంలో చెరగని మైలు రాళ్ళను నిలిపి,
తరగని కీర్తిని ఆర్జించినవారు.

# 4 ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి

© SCERT not to be republished

ఉస్మానియా విశ్వవిద్యాలయం.....

సమయం - ఉదయం పదకొండూ ఇరవై.

ఎం.ఏ తెలుగు విద్యార్థులకు భాషాశాస్త్రం మొదటి తరగతి.

విద్యార్థుల నిరీక్షణ ఫలించి తెలుగు ఆచార్యులు తరగతికి వచ్చారు. ఆయన్ని చూడగానే తరగతిలోని కలకలం హఠాత్తుగా నిశ్శబ్దంగా మారిపోయింది. ఆచార్యులు తనను తాను పరిచయం చేసుకొని, ఐదు నిముషాలు వాళ్ళ నేపథ్యాన్ని గురించి ఆసక్తికరంగా చర్చించి, ఒక ప్రశ్న వేశారు.

"భాషా శాస్త్రంలో దేశవిదేశాల్లో పేరెన్నిక గన్న వారెవరు?"

కొంచెం సేపు గుసగుసలు, తర్జన భర్జనలు ఆపై ఒక విద్యార్థిని సమాధానం - "చేకూరి రామారావు గారు."

ఆ తర్వాత ఆచార్యులు విద్యార్థులను మరికొన్ని ప్రశ్నలడిగారు. వాటికి వాళ్ళు సమాధానాలు చెప్పారు. ఆ చర్చ ఈ కింది విధంగా సాగింది-

"పాఠ్య గ్రంథరచనల్లో బాగా పేరు గాంచిన రచయిత ఎవరో చెప్పండి."

"ఆచార్య కె.కె. రంగనాథాచార్యులు"

"తెలుగు లిపి గురించి, పదప్రయోగాల గురించి అనేక అంశాలు సమగ్రంగా రచించిన గ్రంథకర్త పేరొకటి చెప్పగలరా?"

"డా॥ బూదరాజు రాధాకృష్ణ గారు!"

"తెలుగు అక్షర నిర్మాణం గురించి, ప్రత్యయాదుల ఉత్పాదకత గురించీ ప్రయత్నించిన వారెవరైనా మీకు తెలుసా?"

"డా॥ ఉమామహేశ్వరరావు గారు.."

"మన తెలుగు రాష్ట్రాన్ని భాషననురించి నాలుగు ప్రధాన భాగాలుగా విభజించారు. అందులో మధ్యమండలంగాక, మిగతా మూడు మాండలికాల్లో నవలారచన చేసిన వారెవరో...'

"డా॥ పోరంకి దక్షిణామూర్తి గారు!"

"ఇటువంటి కాకలు తీరిన భాషాయోధులకు సర్వసైన్యాధ్యక్షుడిలాంటి గురువుగారొకరున్నారు. భాషాశాస్త్రాన్ని, భాషా చరిత్రనూ విశ్వవేదిక మీద నిలబడి నినదించి, తెలుగు జాతి కీర్తి కిరీటాన్ని రెపరెపలాడించిన వారు; ద్రవిడ భాషల తీరు తెన్నుల గురించి తులనాత్మకంగా చర్చించి, భాషా పరిశోధకులకు కరదీపికగా నిలిచిన వారు; తెలుగు పుట్టుపూర్వోత్తరాల గురించి నిర్దుష్ట సమాచారాన్నందించిన వారు; దక్షిణాసియా దేశాలన్నిటిలోనూ, మనదేశంలో, మనరాష్ట్రంలో మొట్టమొదటి వృత్తిపదకోశాన్ని తయారు చేసినవారు; గత శతాబ్దిలో అంతర్జాతీయ స్థాయిలో గొప్ప భాషాశాస్త్రవేత్తల్లో భారతదేశానికి చెందిన ఇద్దరిలో ఒకరు; విద్యాబోధనలో వాడుక భాష వినియోగం గురించి గిడుగు, గురజాడల తర్వాత అంతటి కృషి చేసిన మహనీయులూ ఒకరున్నారు....ఆయన...." ఆచార్యుని మాట పూర్తి కాలేదు.

తరగతి గదిలోని మూడోవంతు విద్యార్థులు ముక్త కంఠంతో చెప్పిన సమాధానం– "ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారు!"

***

అవును!

ఆ విద్యార్థుల మాట ప్రత్యక్షర సత్యం.

తిక్కన, శ్రీనాథుల సంప్రదాయ కవిత్వాన్ని ఆరాధించి, వాళ్ళకు దీటుగా ఛందో బద్ధ కవితా రచన చేసిన కృష్ణమూర్తి గారు ఆధునిక ప్రామాణిక భాషా విషయంలో తెలుగు భాషకు అనన్య సామాన్యమైన సేవలందించారు. వర్ణనాత్మక, చారిత్రాత్మక, తులనాత్మక భాషాధ్యయన శీలిగా; నిబద్ధత, నిశితపరిశీలన, మొక్కవోనిదీక్ష గల్గిన సుప్రసిద్ధ పరిశోధకుడుగా; శిష్యుల పట్ల అపార వాత్సల్యాదరాలు కల్గిన ఉత్తమ ఆచార్యుడిగా; ఏ నిర్ణయానికైనా వెరవని పాలనా దక్షుడిగా; నిరంతర శోధన, నిండైన ఆత్మవిశ్వాసం, ఆదర్శవంతమైన బోధన, అగాథమైన విజ్ఞానం, అందరినీ ప్రేమించే సహృదయత మూర్తీభవించిన మహోన్నత వ్యక్తిగా అంతర్జాతీయ కీర్తి గడించిన ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారు మన తెలుగు తేజం. ఆయన గురించి తెలుసుకుంటే మనకు లభిస్తుంది ఉత్తేజం!

ప్రకాశం జిల్లా ఒంగోలులో ఒక సాధారణ కుటుంబంలో 1928 జూన్ 19న జన్మించిన భద్రిరాజు కృష్ణమూర్తి

© SCERT not to be republished

'చిన్నారి పొన్నారి చిరుతకూకటి నాడె...' శ్రీనాథుని ప్రౌఢశైలిని తలపిస్తూ 300 వృత్తపద్యాల్లో 'మాతృసందేశం' అనే కావ్యం (క్విట్ ఇండియా ఉద్యమం నేపథ్యంగా) రచించి పెద్దల మన్నలను పొందారు. అలాగే 'పితృస్మృతి' మీద ఆయన రాసిన పద్యాలు కంటతడి పెట్టిస్తాయి. ప్రౌఢత, ప్రసాదగుణం కలిగిన పద్యాలు అలవోకగా రాయడమే గాక కృష్ణమూర్తి అవధానంకూడా చేసేవారు.

శ్రీగంటి జోగిసోమయాజులు గారివద్ద సంప్రదాయ వ్యాకరణం నేర్చుకున్న కృష్ణమూర్తి పద్యరచన తర్వాత ఆధునిక భాషా, వ్యాకరణాంశాల మీద దృష్టిసారించడం తెలుగువాళ్ళ అదృష్టం.

మొదట ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ట్యూటర్‌గా పనిచేసిన కృష్ణమూర్తిగారు తర్వాత ఉస్మానియా, వేంకటేశ్వర విశ్వవిద్యాలయాల్లో ఆచార్యులుగా సేవలందించి, చివరన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఉపకులపతిగా పదవీబాధ్యతలు నిర్వహించారు. సందర్శకాచార్యులు (Visiting Professor) గా మిచిగాన్, కార్నెల్, టోక్యో, హవాలీ, టెక్సాస్ వంటి ప్రసిద్ధిగాంచిన విదేశీ విశ్వవిద్యాలయాల్లో భాషాశాస్త్రాన్ని వివిధ దేశాల విద్యార్థులకు బోధించారు.

గిడుగు రామమూర్తి పంతులు ప్రవేశపెట్టిన వ్యవహార భాషోద్యమ స్రవంతి ఆగిపోకుండా, కుంటుపడకుండా, మరింత ఉధృతంగా ముందుకు నడిపించే బాధ్యతను తన భుజాలకెత్తుకొని భాషకు మాండలికత ఆవశ్యకతను గుర్తించి, వృత్తిపదకోశాల నిర్మాణాన్ని తన శిష్యుల సహకారంతో విజయవంతంగా నిర్వహించారు. తొలిప్రయత్నంగా వ్యవసాయ, చేనేత వృత్తిపదకోశాలను అందించారు.

కృష్ణమూర్తిగారి భాషాపరిశోధన ఫలాలు తెలుగువాళ్ళకు మాత్రమే పరిమితం కావు. 'మాండలిక వృత్తి పదకోశాల'తో పాటు 'ద్రవిడియన్ లాంగ్వేజెస్', 'కంపేరిటివ్ ద్రవిడియన్ లింగ్విస్టిక్స్, కరెంట్ పర్స్‌పెక్టివ్స్', 'లాంగ్వేజ్-ఎడ్యుకేషన్ అండ్ సొసైటీ, తదితర రచనలు ఇతర భాషల వాళ్ళు చేయవలసిన కృషికి ప్రేరణనిచ్చేవి, ఒరవడి పెట్టేవి.

కృష్ణమూర్తిగారు రచించినవీ సంపాదకత్వం వహించినవీ సుమారు ముప్పై గ్రంథాలు. అలాగే వారి లేఖిని నుండి వందకుపైచిలుకు భాషావ్యాసాలు వెలువడ్డాయి. వయోజన విద్యావ్యాప్తికోసం వీరు రూపొందించిన 'జనవాచకం', తేలిక తెలుగు వాచకం విశిష్ట రచనలు. తెలుగు మాతృభాష కాని వారు ఇంగ్లీషు ద్వారా తెలుగు నేర్చుకునేందుకు 'ఎ బేసిక్ కోర్స్ ఇన్ మాడ్రన్ తెలుగు' శ్రీపి.శివానంద శర్మగారితో కలిసి రచించారు.

తన సిద్ధాంత గ్రంథం 'తెలుగు వెర్బల్ బేసెస్' కృష్ణమూర్తిగారికి ప్రపంచ ఖ్యాతి నార్జించి పెట్టిన గ్రంథం. కాలిఫోర్నియాలో ఎం.బి.ఎమినో గారి శిష్యరికంలో కృష్ణమూర్తిగారు ధ్వని, పదాంశ, వాక్యశాఖల్లో లోతైన పరిశోధనలు చేశారు. 150 సంవత్సరాల నాటి కాల్వెల్డ్ రచన' కంపేరిటివ్ గ్రామర్ ఆఫ్ ద్రవిడియన్ సౌత్ ఇండియన్ లాంగ్వేజెస్‌కు దీటైన 'ద్రవిడభాషల తులనాత్మక అధ్యయనం' గ్రంథాన్ని కృష్ణమూర్తి వెలువరించారు.

ఈ విధంగా భాష, భాషోత్పత్తి లిపి, ప్రాచీనత, వైవిధ్యత, రూప పరిణామక్రమం తదితర అనేకానేక అంశాలను విస్తృతంగా పరిశోధించి, ప్రామాణిక రచనలను ప్రకటించి ప్రపంచ భాషాభిమానుల, పరిశోధకుల గుండెల్లో చెరగని

ముద్ర వేసిన భద్రిరాజు కృష్ణమూర్తి చదువుకున్నది మాత్రం సాధారణ ప్రభుత్వ పాఠశాలల్లో, తెలుగు మాధ్యమంలోనే అన్న సంగతి మనం ఎప్పుడూ గుర్తుంచుకోవాలి.

ఆయన గ్రంథాలను అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు అపురూపంగా అక్కున జేర్చుకోవడం, ప్రచురించడం ద్వారా అవి ఎంతటి ప్రామాణికాలో చెప్పకనే చెబుతున్నాయి.

తెలుగు భాషా ప్రాచీనతను నిలబెట్టడం; నాగరిక సమాజాలు ఉపయోగించే భాషకు మూలాలు గిరిజనుల్లో, జనపదాల్లో, వివిధవృత్తుల్లో ఉన్నాయని చూపడం; ఆధునిక భాషను సజీవంగా ఉంచగలిగేవి మాండలిక పదాలేనని నిరూపించడం; తెలుగు భాషా చరిత్రను ప్రకటించడం; వేల ఏండ్లనాటి మన భాషను, సంస్కృతిని, సంప్రదాయాలను మన కళ్ళముందుంచడం భద్రిరాజు కృష్ణమూర్తిగారు భాషారంగానికి అందించిన తరగని నిధి.

వారి తులనాత్మక పరిశీలనకు ఒక చిన్న ఉదాహరణను గమనించండి.

| వ. సం. | పూర్వమండలం (కళింగ) 1 | దక్షిణ మండలం (రాయలసీమ) 2 | ఉత్తర మండలం (తెలంగాణం) 3 | మధ్య మండలం (ఇతర కోస్తా జిల్లాలు) 4 |
|---|---|---|---|---|
| 1. | మోట | కపిల | మోట | మోట |
| 2. | నాగలి | నాగేలి/మడక | నాగలి | నాగలి |
| 3. | పేడ | పేడ | పెండ | పేడ |
| 4. | ఉండ | గాను/గాలు | గారె/గిర్ర/పయ్యె | చెక్రం |
| 5. | ఆనపకాయ | సొరకాయ | ఆనిగెంకాయ | సొరకాయ |
| 6. | గోంగూర | గోగాకు | పుండికూర/పుంటికూర | గోంగూర |
| 7. | చోడి (బహు. చోళ్ళు) | రాగి | తమిదె/తమిద/తైద | తమిదె |
| 8. | గంటి/గంటె | సద్ద | సజ్జ/ సద్ద | సజ్జ |
| 9. | గునపం | గడ్డపార/గడారు | గడ్డపార | గడ్డపలుగు/గడ్డపార |
| 10. | పూజు/పూదు | కాడిమాను/కాడిమాకు | కాండి/కాణి/కాని | కాడి |

భాషా క్షేత్రంలో చెరగని మైలు రాళ్ళను, తరగని కీర్తి శిఖరాలను నిలిపిన భద్రిరాజు కృష్ణమూర్తి గారు స్వల్ప అస్వస్థతతో 11 ఆగస్ట్ 2012లో తన 84వ ఏట, స్వగృహం 'భారతి' (హైదరాబాద్)లో దేహయాత్ర చాలించారు.

తెలుగు నేలలో ఒక మారుమూల పట్టణంలో జన్మించి, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని, ప్రపంచ భాషాభిమానులందరికీ నిత్యస్మరణీయుడుగా నిలిచిన భద్రిరాజు కృష్ణమూర్తి 'మన వాడు' కావడం తెలుగుజాతి, ఆనక భారత జాతి అంతా గర్వించదగిన విషయం. ఆ మహానుభావుడు భాషాసాహిత్యాల్లో కృషిచేయదలచిన వారందరికీ స్ఫూర్తిదాత!

## ప్రశ్నలు

**I. పదిహేను వాక్యాలకు మించని సమాధానాలు రాయండి.**

1. భద్రిరాజు కృష్ణమూర్తి గారు నిర్వహించిన బాధ్యతలు పేర్కొనండి.
2. భద్రిరాజు కృష్ణమూర్తి గారు గొప్ప పరిశోధకులు; ఆచార్యులు; దీక్షాదక్షులు; పరిపాలకులు – అని సమర్థించండి.
3. భాషా పరిశోధనకు ఉద్యమించక మునుపు భద్రిరాజు కృష్ణమూర్తి జీవితం ఎలా సాగిందో వివరించండి.
4. భద్రిరాజు కృష్ణమూర్తి భాషాసేవను గురించి రాయండి.

*****

(దీనిని చూడండి....)

## తెలుగు లిపి పరిణామ క్రమము

